సాక్షి
యాదాద్రి భువనగిరి

I

శుక్రవారం । 15 । ఆగస్టు । 2025

పంద్రాగస్టుకు ముస్తాబు

స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా విద్యుత్ దీపాల అలంకరణలో యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్



న్యూస్‌రీల్

పంద్రాగస్టు వేడులకు ముఖ్య అతిథిగా గుత్తా

సాక్షి, యాదాద్రి: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శుక్రవారం నిర్వహించే స్వాతంత్య్ర వేడుకలకు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఉదయం 9.30 గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తారు. అనంతరం రాష్ట్ర, జిల్లా ప్రగతిపై ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. 9.55 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, 10.15కు ప్రభుత్వ శాఖల శకటాలు ప్రదర్శన, 10.25 గంటలకు ప్రశంస పత్రాల పంపిణీ ఉంటుంది. అనంతరం శాసన మండలి చైర్మన్‌తో పాటు ఎమ్మెల్యేలు, అధికారులు, ఇతర ప్రముఖులు స్టాళ్లను సందర్శిస్తారు.

కలెక్టరేట్‌లో..

కలెక్టర్ కార్యాలయంలో ఉదయం 8.30 గంటలకు కలెక్టర్ హనుమంతరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు.అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పరేడ్ గ్రౌండ్‌లో జరిగే వేడుకల్లో పాల్గొంటారు.

రూ.5లక్షల విరాళం



డిప్యూటీ ఈఓకు చెక్కు అందజేస్తున్న సత్యనారాయణ- సరళాదేవి దంపతులు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో భక్తులకు అన్న ప్రసాదానికి హైదరాబాద్‌కు చెందిన పుప్పె సత్యనారాయణ-సరళాదేవి దంపతులు రూ.5లక్షల విరాళం అందజేశారు. గురువారం శ్రీస్వామి వారిని దర్శించుకున్న అనంతరం ఆలయ డిప్యూటీ ఈఓ భాస్కర్‌శర్మకు చెక్కు అందజేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

భువనగిరి: చందేపల్లి పరిధిలోని అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఖాళీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా విద్యాశాఖ ఏడీ ప్రశాంత్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అటెండర్, డే, నైట్ వాచ్‌మన్లు, హెడ్ కుక్, అసిస్టెంట్ కుక్, స్వీపర్ పోస్టు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు 18 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. దరఖాస్తులను ఈనెల 22వ తేదీ లోపు డీఈఓ కార్యాలయంలో అందజేయాలని కోరారు. వివరాలకు 9441189894 నంబర్‌ను సంప్రదించాలన్నారు. అలాగే కస్తూరిబాగాంధీ విద్యాలయాల్లో 4 అకౌంటెంట్, 2 ఏఎన్ఎం పోస్టులకు అర్హులైన మహిళలు ఈనెల 22 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాల కోసం సెల్ నంబర్ 9441189894ను సంప్రదించాలన్నారు.

పుణ్యక్షేత్రాలకు స్పెషల్ బస్సు

ఆత్మకూరు(ఎం): శ్రావణమాసం సందర్భంగా పుణ్యక్షేత్రాల సందర్శనకు తొర్రూరు డిపో నుంచి స్పెషల్ సూపర్ లగ్జరీ బస్సు నడిపిస్తున్నట్లు డిపో మేనేజర్ పద్మావతి తెలిపారు. ఈ నెల 21వ తేదీ రాత్రి బయలుదేరి అన్నవరం, సింహాచలం, ఆర్‌కే బీచ్, సామర్లకోట, పిఠాపురం, 12వ శక్తిపీఠం, విజయవాడ, ఉండవల్లి గుహలు, శ్రీపరిటాల హనుమాన్ ఆలయం, పెనుగ్రంచిప్రోలులోని ఆలయాలను దర్శించుకుని 24న తొర్రూరుకు చేరుకుంటుందన్నారు. చార్జి పెద్దలకు రూ.2,500, పిల్లలకు రూ.1,300 నిర్ణయించినట్లు తెలిపారు. వివరాలకు 7032182456, 8074474894లను సంప్రదించాలని కోరారు.



77 ఏళ్లుగా మువ్వన్నెల రెపరెపలు

రాజాపేట: భారతదేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్య్రం రాగా.. తెలంగాణ ప్రాంతంలో మాత్రం రైతాంగ సాయుధ పోరాటం తర్వాత 1948 సెప్టెంబర్ 17న నిజాం పాలన నుంచి విముక్తి లభించడంతో రాజాపేట మండలం బేగంపేట గ్రామం నడిబొడ్డున అదే గ్రామానికి చెందిన స్వాతంత్య్ర సమరయోధులు బద్దం నర్సిరెడ్డి, బల్జె వీరయ్య, చీగుళ్ల మల్లయ్య జాతీయ జెండాను ఎగురవేసి తమ దేశభక్తిని చాటుకున్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు 77 ఏళ్లుగా బేగంపేట గ్రామం నడిబొడ్డున మువ్వన్నెల జెండా రెపరెపలాడుతూనే ఉంది. తమ పెద్దలు చూపిన మార్గాన్ని ఇప్పటికీ గ్రామస్తులు అనుసరిస్తూ నిరంతరాయంగా మువ్వన్నెల జెండాను ఎగురవేసే ఆనవాయితీని కొనసాగిస్తున్నారు. అంతేకాకుండా గ్రామస్తులంతా కలిసి ఆ జెండా ఎగురవేసే ప్రదేశంలో 1979లో జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహం ఏర్పాటు చేసుకున్నారు. యువతతో పాటు భావిభారత పౌరుల్లో దేశభక్తిని పెంపొందించేందుకు ప్రతి సంవత్సరం జనవరి 26, ఆగస్టు 15వ తేదీ, దసరా పండుగ రోజున పాత జెండాను మార్చి నూతన జెండాను ఎగురవేస్తూ జాతీయ నాయకులను స్మరించుకుంటున్నారు.

బేగంపేట గ్రామంలో నిరంతరాయంగా ఎగురుతున్న జాతీయ పతాకం

త్యాగధనుల స్ఫూర్తి.. సంకల్ప సిద్ధి

దేశంకోసం ప్రాణాలర్పించిన మహనీయుల స్ఫూర్తితో ముందుకు సాగుతున్నారు జిల్లాకు చెందిన ఎంతోమంది. జాతిపిత మహాత్ముడి అడుగుజాడల్లో నడుస్తూ తమ గ్రామాల్లో మద్యపాన నిషేధం అమలు చేస్తున్నవారు కొందరైతే.. సేంద్రియ సాగుతో ధాన్యపు సిరులు పండిస్తున్నవారు, పర్యావరణ హితమే లక్ష్యంగా ప్లాస్టిక్ కవర్ల నిషేధంకోసం పాటుపడుతున్న వారు మరికొందరు. దేశ రక్షణలో సైతం పాలుపంచుకుంటున్నారు. ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొని ఉమ్మడి జిల్లాకే గర్వకారణంగా నిలిచాడు నాగిరెడ్డిపల్లికి చెందిన జగన్. నేడు స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా వారిపై ప్రత్యేక కథనాలు.

సేంద్రియ సాగులో రాణిస్తున్న పట్టభద్రుడు

మోత్కూరు: మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని ఆరెగూడెం గ్రామానికి చెందిన యువ రైతు బిల్లపాటి గోవర్ధన్‌రెడ్డి ఉన్నత చదువులు చదివి వ్యవసాయంపై ఉన్న మక్కువతో సేంద్రియ వ్యవసాయంలో రాణిస్తున్నారు. అర్థశాస్త్రంలో పోస్టుగ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన గోవర్ధన్‌రెడ్డి గత నాలుగేళ్లుగా గోఆధారిత సేంద్రియ వ్యవసాయం చేస్తున్నారు. అంతరించిపోతున్న దేశీయ వరి రకాలను కాపాడటం, పర్యావరణాన్ని, భూమి, నీరు పరిరక్షించుకోవడం, తగ్గుతున్న భూసారాన్ని కాపాడాలనే లక్ష్యంతో సేద్యం చేస్తున్నారు. రసాయన మందులు లేని ఆహారాన్ని భవిష్యత్తు తరాలకు అందించడం కోసం కృషిచేస్తున్నారు. గోవుల పెంపకంతో వాటి మలమూత్రంతో జీవామృతం, ఘన జీవామృతం, గో కృపామృతం, కషాయాలు ఉపయోగించి దేశవాళి పంటలను పండిస్తున్నారు. కూరగాయలు, ఆకుకూరలతో పాటు వరిలో దేశవాళి రకాలైన నవార, రత్నచోళి, మైసూర్, మల్లిక, మట్ట రైస్, కులాకర్, కృష్ణ ప్రియ, బహురూపి పండిస్తున్నారు. సేంద్రియ పంటలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండటంతో ఆశించిన లాభాలు వస్తున్నాయని ఆయన పేర్కొంటున్నారు. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన ప్రతిష్ఠాన్ సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుడమి పుత్ర పురస్కారాన్ని గతేడాది డిసెంబర్‌లో యాదగిరిగుట్టలో నిర్వహించిన కార్యక్రమంలో గోవర్ధన్‌రెడ్డి అందుకున్నారు. సేంద్రియ వ్యవసాయంపై తాను అవగాహన పెంచుకుంటూ రైతులకు అవగాహన కల్పిస్తున్నానని ఆయన చెబుతున్నారు.



వరి పొలంలో రైతు గోవర్ధన్‌రెడ్డి


ఆపరేషన్ సిందూర్‌లో భువనగిరి బిడ్డ

- పాక్ సైనికుల మిస్సైల్స్ దాడి నుంచి తృటిలో తప్పిన ప్రమాదం

భువనగిరి: జమ్ముకశ్మీర్‌లోని పహల్గాం దాడికి ప్రతీకారంగా భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సింధూర్‌లో యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన సైనికుడు పాల్గొన్నాడు. భువనగిరి మండలంలోని నాగిరెడ్డిపల్లికి చెందిన సుక్క పెద్ద మల్లయ్య, పోచమ్మల కుమారుడు జగన్ 2006లో భారత సైన్యంలో హవాల్దార్‌గా చేరాడు. మొదట్లో అసోంలో పదేళ్లపాటు విధులు నిర్వహించాడు. 2014లో జార్ఖండ్ లోని రాంచీలో యాంటీ నక్సల్స్ ఆపరేషన్‌లో పాల్గొన్నాడు. ఈ సమయంలో బాంబు పేలుడులో ఆయనకు ప్రమాదం తప్పింది. 2015లో ఉత్తరప్రదేశ్‌లోని బరేలీ ప్రాంతానికి వెళ్లాడు. 2017 నుంచి 2022 వరకు అసోంలోని గౌహతి పట్టణానికి సమీపంలో విధులు నిర్వహించాడు.

ఆపరేషన్ సిందూర్‌లో..

ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా 49 మందితో కూడిన రైస్ రైఫిల్ బృందాన్ని జమ్ముకశ్మీర్‌లోని రాజోరీ జిల్లాకు రక్షణ శాఖ పంపింది. ఆ బృందంలో జగన్ కూడా ఉన్నారు. మే 6వ తేదీన పాకిస్తాన్ మిస్సైళ్లతో దాడి చేయగా వారు ఉంటున్న క్యాంప్‌నకు 100 మీటర్ల దూరంలో పడటంతో భారీ పేలుడు సంభవించింది. దీంతో తృటిలో ప్రాణాపాయం తప్పింది. అయినా దాయాదుల దాడులకు బెదరకుండా మూడు రోజుల పాటు ఆపరేషన్‌లో పాల్గొన్నాడు. రేయింబవళ్లు ఆపరేషన్‌లో పాల్గొనేవాడు. ఇదే సమయంలో పాకిస్తాన్‌కు చెందిన ఉగ్రవాదులు దేశంలోకి ప్రవేశించడంతో వారిని పట్టుకునేందుకు రోజూ 20 నుంచి 30 కిలోమీటర్ల వరకు కాలినడకన నడుస్తూ విధులు నిర్వహించాడు. సెస్ట్ ప్రాంతంలో రెండుమూడు సార్లు ఫైర్ సైతం చేశాడు. గస్తీ, వాహనాల తనిఖీలు, దేశంలోకి ప్రవేశించిన ఉగ్రవాదులను పట్టుకోవడం వంటి విధుల్లో జగన్ పాల్గొన్నాడు. వీటితో పాటు మరికొన్ని సైనిక కార్యకలాపాల్లో పాలుపంచుకున్నాడు.



సరిహద్దులో పహారా కాస్తున్న సైనికుడు జగన్

గర్వంగా ఉంది



సైనికుడిగా దేశానికి సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నా. ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్నందుకు ఎంతో గర్వంగా ఉంది. ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న సైనికులు ప్రాణాలు కోల్పోతున్నా ఉగ్రవాదులను పట్టుకోవాలనే తపన ఉండేది.


–సుక్క జగన్, సైనికుడు

స్వేచ్ఛ, సమానత్వం అంతంతే..

- అవినీతి, పేదరికమే అసలు సమస్య
- అధికార యంత్రాంగం నీతి, నిజాయితీతోనే మేలు
- నాణ్యమైన విద్య ఇప్పటికీ అందని ద్రాక్షే

'సాక్షి' సర్వేలో యువత మనోగతం

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: దేశ వ్యాప్తంగా 79 ఏళ్ల స్వాతంత్య్ర దినోత్సవాన్ని జరుపుకోబోతున్న తరుణంలోనూ స్వేచ్ఛ సమానత్వం లేకుండాపోయిందని నేటి యువతరం వాపోతోంది. సమాజంలో అవినీతి, పేదరికం ఇంకా ప్రధాన సమస్యగానే ఉన్నాయని పేర్కొంది. స్వాతంత్య్ర దినోత్సవం వేళ.. ప్రజలు, ముఖ్యంగా యువతరం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు, స్వేచ్ఛ, సమానత్వం అందుతున్న తీరు, స్వాతంత్య్ర ఫలాలు అందరికీ దక్కాలంటే ఏం చేయాలన్న అంశాలపై 'సాక్షి' ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సర్వే నిర్వహించాం. 90 మంది నుంచి అభిప్రాయాలు సేకరించాం. దేశానికి స్వాంతంత్య్రం వచ్చి 78 ఏళ్లు పూర్తయినా సమాజంలో ఇప్పటికీ స్వేచ్ఛ సమానత్వం లేకుండా పోయిందని అత్యధికులు అభిప్రాయపడ్డారు. అవినీతి పేదరికం కొనసాగుతోందని, అందరికీ నాణ్యమైన విద్య, వైద్యం అందడం లేదని పేర్కొన్నారు. స్వాతంత్య్ర ఫలాలు అందరికీ దక్కాలంటే.. అధికార యంత్రాంగం నీతి, నిజాయితీతో పనిచేయాలని, చట్టసభలు సమర్థవంతంగా వ్యవహరించాలని, న్యాయ వ్యవస్థ మరింత మెరుగైన పాత్రను పోషించాల్సిన అవసరం ఉందని వెల్లడించారు. ఇందులో మీడియా పాత్ర ప్రధానమేనని వివరించారు.



78 ఏళ్ల స్వాతంత్య్రం తర్వాత..

1. మీరు ఎదుర్కొంటున్న అతి పెద్ద సమస్య ఏదీ?
2. స్వేచ్ఛ - సమానత్వం నిజంగానే అందరికి చేరుతోందా?
3. స్వాతంత్య్ర ఫలాలు అందరికీ దక్కాలంటే మరింత నీతి, నిజాయితీగా పనిచేయాల్సిన రంగం ఏదీ?

ఒకే మాట.. ఒకటే బాట

సంస్థాన్ నారాయణపురం: మునుగోడు నియోజకవర్గ పరిధిలోని సంస్థాన్ నారాయణపురం మండలంలోని గ్రామాల్లో మద్యం అమ్మకాల నిషేధం కఠినంగా అమలవుతోంది.

అల్లందేవిచెర్వు గ్రామం నుంచి ప్రారంభం..

ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆరేళ్ల క్రితం సంస్థాన్ నారాయణపురం మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో.. బెల్టుషాపులు మూసివేసి మద్యం అమ్మకాలను నిషేధించిన గ్రామాల అభివృద్ధి కోసం తన తల్లి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ పేరిట రూ.5లక్షలు ప్రోత్సాహకం ఇస్తానని ప్రకటించారు. దీంతో సంస్థాన్ నారాయణపురం మండలం అల్లందేవిచెర్వు గ్రామస్తులు సమావేశమై తీర్మానం చేశారు. అందుకు అనుగుణంగా గ్రామంలో బెల్టుషాపులను మూసివేసి, మద్యం అమ్మకాలను నిషేధించారు. ఆ తర్వాత చిమిర్యాల గ్రామస్తులు కూడా ఈ విధానాన్ని అమలు చేశారు. ఈ రెండు గ్రామాల స్ఫూర్తితో గ్రామాగ్రామాన బెల్టుషాపుల మూసివేత పోరాటం కొనసాగింది.



అల్లందేవిచెర్వు గ్రామ వ్యూ

మద్యం అమ్మకాలు నిషేధించిన అల్లందేవిచెర్వు గ్రామానికి ఇచ్చిన మాట ప్రకారం ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఐదేళ్ల కిందట రూ.5లక్షలు ప్రోత్సాహకం అందజేశారు. ఆ నిధులతో గ్రామంలో ఆరోగ్య ఉప కేంద్రం నిర్మాణం చేపట్టారు.

గ్రామస్తుల సహకారంతో అమలు చేశా



ఎమ్మెల్యే ప్రకటనతో గ్రామస్తుల సహకారంతో మద్యం అమ్మకాలను నిషేధాన్ని కఠినంగా అమలు చేశాం. దీంతో మా గ్రామానికి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ద్వారా రూ.6లక్షలు నిధులు ఇవ్వడంతో ఆరోగ్య ఉపకేంద్రం నిర్మించుకున్నాం.

– సుర్వి యాదయ్య, మాజీ సర్పంచ్

మునుగోడులో 'ప్లాస్టిక్'పై చైతన్యం

మునుగోడు: పర్యావరణానికి ముప్పు కలిగించే ప్లాస్టిక్ కవర్లు మునుగోడు మండలంలో కనుమరుగయ్యాయి. మూడు నెలల క్రితం వరకు ప్రతిఒక్కరూ ప్లాస్టిక్ కవర్లను విచ్చలవిడిగా వినియోగించేవారు. అయితే స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని ప్రజల ప్రాణాలకు హాని కలిగించే ప్లాస్టిక్ కవర్లను పూర్తిగా నిషేధించాలని అధికారులను ఆదేశించారు. దీంతో మండల, గ్రామ స్థాయి అధికారులంతా రంగంలోకి దిగి ప్లాస్టిక్ కవర్ల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై గ్రామగ్రామాన ప్రజలకు అవగాహన కల్పించి చైతన్యపర్చారు. దీంతో మండలంలో దశలవారీగా ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని మానిపించారు. ప్రతి దుకాణాన్ని తనిఖీ చేస్తూ ప్లాస్టిక్ కవర్ల వినియోగానికి చెక్ పెట్టారు. చాటుమాటుగా వినియోగిస్తున్న దాదాపు 30మందికిపైగా దుకాణాదారులకు ఒక్కొక్కరికి రూ.వెయ్యి నుంచి రూ.3వేల వరకు జరిమానాలు విధించారు. దీంతో ప్రస్తుతం మండల వ్యాప్తంగా వివిధ దుకాణాల్లో చూద్దామన్నా ప్లాస్టిక్ కవర్లు కన్పించడం లేదు.



ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్న అధికారులు (ఫైల్)

అగ్రదేశాల సరసన భారత్

- నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన అవకాశాలకు మరింత ప్రాధాన్యమివ్వాలి
- పల్లెలకూ సాంకేతిక పరిజ్ఞానం విస్తరిస్తే ఎంతో ప్రయోజనం
- ప్రతి ఒక్కరికీ హెల్త్ ప్రొఫైల్ తప్పనిసరి
- కఠిన చట్టాలున్నా మహిళలపై అఘాయిత్యాలు ఆందోళన కలిగిస్తున్నాయి

'సాక్షి'టాక్ షోలో ఇంజనీరింగ్ విద్యార్థుల మనోగతం



భూదాన్‌పోచంపల్లి మండలం దేశ్‌ముఖిలోని విజ్ఞాన్ యూనివర్సిటీలో 'సాక్షి' నిర్వహించిన టాక్ షోలో పాల్గొన్న ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు

సాక్షి టాక్ షో

భూదాన్‌పోచంపల్లి: 'మారుతున్న కాలాగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడుతూ వివిధ రంగాల్లో రాణిస్తోంది యువత. స్కిల్ ఇండియాగా అవతరించి అగ్రదేశాల సరసన నిలిచే సామర్థ్యం మనకు ఉంది. అందుకు యువత మరింత కష్టపడాలి. వీటితో పాటు పరిశుభ్రత, ఆరోగ్యంపై గ్రామీణ ప్రజలను జాగృతం చేయాల్సిన అవసరం ఉంది' అని భూదాన్‌పోచంపల్లి మండలం దేశ్‌ముఖిలోని విజ్ఞాన్ యూనివర్సిటీ ఇంజనీరింగ్ విద్యార్థులు తెలిపారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని 'వందేళ్ల భారతం ఎలా ఉండబోతుంది.. అందుకు మీ పాత్ర ఏమిటి' అనే అంశంపై నిర్వహించిన సాక్షి టాక్‌లో తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

ఆవిష్కరణలను స్వాగతించాలి



నూతన ఆవిష్కరణలను స్వాగతిస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుంది. పది మంది చేసే పనిని ఏఐ టెక్నాలజీతో ఒక్కరే చేయవచ్చు. ఏఐ టెక్నాలజీని పనిని సులభతరం చేయడానికి వినియోగించాలి తప్ప.. ఉద్యోగులను తొలగించొద్దు.

–లక్ష్మణ్‌రెడ్డి, ఏఐఎంఎల్

పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించాలి



మోదీ విజన్ వల్ల ప్రపంచంలో ఇండియా మూడో ఆర్థిక దేశంగా ఎదిగింది. వచ్చే 20 ఏళ్లలో వందశాతం పేదరిక నిర్మూలన జరగాలి. రిజర్వేషన్‌లను తొలగించి స్కిల్‌కు ప్రాధాన్యత కల్పించాలి. టాలెంట్, ఉపాధికి పెద్దపీట వేయాలి. ప్రభుత్వాలు సాంకేతిక విద్యను ప్రోత్సహిస్తే స్కిల్ ఇండియా రూపొందుతుంది.

–ఉజ్వల్, సీఎస్ఈ

విదేశాలపై ఆధారపడొద్దు



ఆటోమొబైల్‌లో రంగంలో ప్రపంచంలో భారత్ 3వ స్థానంలో ఉంది. ఆటోమొబైల్ రంగం నుంచే 7శాతం జీడీపీ వస్తుంది. విదేశీ పరిజ్ఞానంపై ఆధారపడకుండా స్వదేశీ పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయాలి. ఇందుకోసం డెవలప్‌మెంట్ రీసెర్చ్ సెంటర్లు ఏర్పాటు చేయాలి.

–శశి, డేటా సైన్స్ ఇంజనీరింగ్

నాణ్యమైన వైద్యం అందడం లేదు



చాలామందికి సరైన వైద్యం, నాణ్యమైన ఆహారం అందడం లేదు. అందుకే ప్రతి ఒక్కరి హెల్త్ ప్రొఫైల్ రూపొందించి అమలు చేయాలి. ఫార్మా, బయోటెక్నాలజీలో దేశం ముందంజలో ఉన్నా, పేదలకు నాణ్యమైన వైద్యం అందుబాటులో లేదు. రోబోటిక్ టెక్నాలజీని వినియోగించాలి.

–నవీన్, బయో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ

మహిళలపై దాడులు బాధాకరం



స్వాతంత్రం వచ్చి 79 సంవత్సరాలు గడుస్తున్నా మహిళలపై దాడులు జరుగుతుండటం బాధాకరం. నిర్భయ లాంటి చట్టాలను తీసుకొచ్చిన దాడులు ఆగడంలేదు. మహిళలకు పూర్తిగా రక్షణ కల్పించాలి. సెక్యులర్ ఇండియా కంటే సెక్యూర్ ఉమెన్‌తోనే దేశం పురోగతి సాధిస్తుందన్న నమ్మకం ఉంది.

–విశాల, ఈసీఈ

టెక్నాలజీ విస్తరించినప్పుడే అభివృద్ధి



దేశానికి పల్లెలు పట్టుగొమ్మలు. సాంకేతిక పరిజ్ఞానం పల్లెలకు కూడా విస్తరించాలి. ఇంటర్నెట్ సౌకర్యం అందుబాటులో ఉంటే ప్రపంచం, దేశంలో ఎపుడు, ఏమి జరుగుతుందని తెలుసుకొని ప్రజలు చైతన్యవంతులవుతారు. పరిశుభ్రత, ఆరోగ్యంపై గ్రామీణ ప్రజలను జాగృతం చేయాల్సిన అవసరం ఉంది.

–రామలక్ష్మి, ఏఐఎంఎల్

వెల్లివిరిసిన జాతీయత



ఆలేరు: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన ఎన్‌సీసీ కేడెట్‌లు గురువారం హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. జాతీయ పతాకాలు చేతబూని దేశభక్తులను గౌరవిద్దాం అని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు దాసరి మంజుల, ఎన్‌సీసీ అధికారి దూడల వెంకటేష్, ఉపాధ్యాయుడు మేఘరాజు, సీనియర్ కేడెట్లు మర్ల సాయికుమార్, పాముశివ, వినయ్, భరత్, మనోజ్, శ్రీశాంత్ తదితరులు పాల్గొన్నారు.

వరలక్ష్మీ వ్రతాలకు సిద్ధం

యాదగిరిగుట్ట: శ్రావణమాసాన్ని పురస్కరించుకొని యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శుక్రవారం నిర్వహించే వరలక్ష్మీ వ్రతాలకు ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. యాదగిరి కొండ దిగువన ఉన్న శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపం హాల్‌లో వ్రత పీటలు, అమ్మవారి ఫొటోలను సిద్ధం చేశారు.వ్రత పూజలకు ఇప్పటికే భక్తులు పెద్ద సంఖ్యలో పేర్లు నమోదు చేసుకున్నారు. శ్రావణ మాసం ముగిసే వరకు వ్రత పూజలు జరుగుతాయని అధికారులు తెలిపారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.



సత్యనారాయణ వ్రత మండపంలో వ్రత పీటలు, అమ్మవారి ఫొటోలను సిద్ధం చేస్తున్న ఆలయ సిబ్బంది

• 26 గేట్ల నుంచి నీటి విడుదల



నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి గురువారం 26 క్రస్ట్ గేట్ల ద్వారా 2,03,762 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ఎగువన నుంచి 1,72,774 క్యూసెక్కుల వరద నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరుతోంది.

• ఉరకలేస్తున్న మూసీ



కేతేపల్లి: ఎగువ నుంచి మూసీ ప్రాజెక్టుకు వరద ఉధృతి కొనసాగుతోంది. దీంతో గురువారం అధికారులు ఎనిమిది క్రస్ట్ గేట్ల ద్వారా 10,039 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు.

డీసీసీబీ పదవీకాలం పొడిగింపు

- పీఏసీఎస్ పాలకవర్గాల గడువు సైతం పొడిగించిన ప్రభుత్వం
- మరో ఆరు నెలల పాటు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ
- వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు డీసీసీబీ చైర్మన్‌గా కుంభం శ్రీనివాస్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ), జిల్లా నాగార్జున మార్కెటింగ్ సొసైటీ (ఎన్‌డీసీఎంఎస్), జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్) పాలకవర్గాల పదవీ కాలాన్ని ప్రభుత్వం పొడిగించింది. గురువారం పాలకవర్గం పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో గురువారమే వాటి పదవీకాలాన్ని పొడిగిస్తూ వ్యవసాయ, సహకార శాఖ కార్యదర్శి ఎం. రఘునందన్‌రావు ఉత్తర్వులు జారీచేశారు. దీంతో ఉమ్మడి జిల్లాలోని 107 పీఏసీఎస్‌లు, ఎన్‌డీసీఎంఎస్‌తోపాటు డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాసరెడ్డి, డైరెక్టర్లు మరో ఆరునెలలపాటు ఆ పదవుల్లో కొనసాగుతారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 14వ తేదీ తరువాత మళ్లీ పొడిగిస్తారా? ఎన్నికలు నిర్వహిస్తారా? అన్న అంశంపై జనవరి వరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది. జిల్లాలోని పీఏసీఎస్‌లు, డీసీసీబీ పాలకవర్గాల నియామకం కోసం ప్రభుత్వం 2020 ఫిబ్రవరిలో ఎన్నికలు నిర్వహించింది. అదే నెల 14వ తేదీన పాలకవర్గాలు బాధ్యతలను స్వీకరించాయి. దాని ప్రకారం ఈ ఏడాది ఫిబ్రవరి 14వ తేదీ నాటికి కొత్త పాలకవర్గాలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అయితే రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు గ్రామ పంచాయతీలు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపాలిటీలకు ఎన్నికలు నిర్వహించలేదు. అందులో భాగంగా డీసీసీబీ, పీఏసీఎస్‌లకు కూడా ఎన్నికలు నిర్వహించలేదు. దీంతో ఈ ఏడాది ఫిబ్రవరిలో ఒకసారి పదవీ కాలాన్ని ఆరు నెలలపాటు పొడగించింది. ఇప్పుడు తాజాగా రెండోసారి మరో ఆరు నెలల పాటు పదవీ కాలాన్ని పొడగించింది.


రైతు సంక్షేమానికి మరింతగా కృషి

ప్రభుత్వం రైతుల సంక్షేమ, అభివృద్ధికి మరోసారి కృషి చేసే అవకాశాన్ని తమకు కల్పించిందని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో బ్యాంకు ఆధ్వర్యంలో రైతులకు ఉపయోగపడే మరిన్ని కార్యక్రమాలను చేపడతామన్నారు. రానున్న ఆరు నెలల కాలంలో బ్యాంకును మరింత అభివృద్ధి చేసేందుకు శాయశక్తులా కృషి చేస్తాని పేర్కొన్నారు.

వెండితో 'ఇండియా గేట్'



శ్రీనివాసచారి



వెండితో తయారు చేసిన ఇండియా గేట్ నమూనా

భువనగిరి: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని భువనగిరి పట్టణంలోని గంజ్ ఏరియాకు చెందిన స్వర్ణకారుడు చొల్లేటి శ్రీనివాసచారి సూక్ష్మ సైజులో ఇండియా గేట్ నమూనాను రూపొందించాడు. రూ.19వేలు విలువ చేసే 16 తులాల వెండితో మూడున్నర ఇంచుల ఎత్తు, మూడు ఇంచుల వెడల్పుతో ఇండియా గేట్ నమూనాతయారు చేశాడు. ఇందుకు నెల రోజుల పాటు శ్రమించానని శ్రీనివాసచారి తెలిపారు. గతంలో క్రికెట్ స్టేడియం, పార్లమెంట్ భవనం, తెలంగాణ, క్రికెట్, ఫుట్‌బాల్ ప్రపంచ కప్‌లు, బతుకమ్మ, ఇటలీలోని సలోసియాం వంటి వాటిని తయారు చేసి అందరి చేత శభాష్ అనిపించుకున్నాడు.

ఢిల్లీలో స్వాతంత్ర్య వేడుకలకు ఆహ్వానం



రామమూర్తి

మోత్కూరు: మోత్కూరు మండల పరిధిలోని పాటిమట్ల గ్రామ పంచాయతీకి చెందిన అభ్యుదయ రైతు తేలుకుంట్ల రామమూర్తికి శుక్రవారం ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు హాజరు కావాలని కేంద్ర ప్రభుత్వం నుంచి ఆహ్వానం అందింది. ఆయన గత ఐదేళ్లుగా సుమారు 10 ఎకరాల్లో ఆధునిక పద్ధతిలో కలబంద సాగుచేస్తూ వివిధ ఔషధ, సౌందర్య ఉత్పత్తుల కంపెనీలకు సరఫరా చేస్తున్నారు. దీంతో గ్రామీణ స్థాయిలో ఆదర్శ రైతుగా గుర్తింపు పొందిన రామమూర్తిని స్వాతంత్ర్య వేడుకలకు హాజరుకావాలని కేంద్రం ఆహ్వానించింది. ఈ మేరకు గురువారం ఆయన ఢిల్లీకి బయల్దేరి వెళ్లారు.

నేడు యాదగిరిగుట్టకు దేవాదాయ మంత్రి రాక

యాదగిరిగుట్ట: రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ శుక్రవారం యాదగిరిగుట్టకు రానున్నారని ఈఓ వెంకట్రావ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం స్వామివారిని దర్శించుకున్న అనంతరం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో రూపొందించిన యాదగిరి ఆధ్యాత్మిక మాసపత్రిక, ఈ–ఆఫీస్‌ను ఆమె ప్రారంభిస్తారని తెలిపారు.

నేటి నుంచి ఈ–ఆఫీస్ సేవలు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో కార్యక్రమాలన్నీ శుక్రవారం నుంచి ఈ–ఆఫీస్ ద్వారా కొనసాగించనున్నారు. ఇకపై అన్నిరకాల సేవలు పేపర్‌రహితంగానే ఉంటాయని, ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తిచేశామని, సిబ్బందికి శిక్షణ కూడా ఇచ్చినట్లు ఈఓ వెంకట్రావ్ వెల్లడించారు. డిజిటల్ సంతకాల వినియోగం, ఫైళ్ల ఆన్‌లైన్ ట్రాకింగ్, ఈ–ఆఫీస్ పనితీరుపై సిబ్బందికి నిపుణులు అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. ఈ–ఆఫీస్ ద్వారా భక్తులకు వేగవంతమైన, నాణ్యమైన, పారదర్శకమైన సేవలు అందుతాయన్నారు.

మన నడిగూడెంలోనే.. జాతీయ జెండా రూపకల్పన

- పింగళి వెంకయ్య చేతుల్లో రూపుదిద్దుకున్న త్రివర్ణ పతాకం
- జమీందారు నాయిని వెంకటరంగారావు కోటలో జెండా కూర్పు
- గాంధీజీ సూచనతో తెలుపు రంగుతో తుది మెరుగులు



నడిగూడెం: భిన్న సంస్కృతులకు నిలయమైన భారతదేశాన్ని ఏకం చేస్తూ దేశ కీర్తిని తన మువ్వన్నెల్లో ప్రతిబింబిస్తూ భారతీయులంతా సగర్వంగా సెల్యూట్ చేస్తున్న మన జాతీయ పతాకానికి నడిగూడెం రాజావారి కోటలో రూపకల్పన జరిగింది. నాటి మునగాల పరగణాను నడిగూడెంలోని కోటను కేంద్రంగా చేసుకుని జమీందారు బహద్దూర్ రాజా నాయిని వెంకటరంగారావు పాలన సాగిస్తున్నారు. ఈ సమయంలో రాజావారికి పింగళి వెంకయ్య పరిచయం కాగా తన కోటకు ఆహ్వానించి వ్యవసాయ అధికారిగా నియమించారు. ఈ సమయంలోనే పింగళి వెంకయ్య జాతీయ జెండా రూపకల్పనకు పూనుకున్నారు.

కోట సాక్షిగా త్రివర్ణ పతాకం..

నడిగూడెం రాజావారి కోటలో వ్యవసాయ అధికారిగా పనిచేస్తున్న పింగళి వెంకయ్య కోట సాక్షిగా జాతీయజెండాకు రూపకల్పన చేశారు. 1916 లక్నోలో నిర్వహించిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశంలో వెంకయ్య తయారు చేసిన జాతీయ జెండాను ఎగురవేశారు. 1921లో అఖిల భారత కాంగ్రెస్ సమావేశాల్లో నేటి విజయవాడ (నాటి బెజవాడ)లో ఎగురవేశారు. గాంధీజీ ఈ సమావేశానికి వెంకయ్యను పిలిపించి కాషాయం, ఆకుపచ్చ రంగులతోపాటు సత్యం, అహింసకు నిదర్శనమైన తెలుపు రంగు మధ్యలో రాట్నంగల ఒక జెండాను రూపొందించమని కోరారు. దీంతో గాంధీ సూచన మేరకు వెంకయ్య 1921 మార్చి 31న జెండాను పూర్తిస్థాయిలో రూపొందించారు. ఈ జెండాకు రూపకల్పన జరిగి 2021 మార్చి 31న వందేళ్ల వేడుకలను జరుపుకుంది. అయితే 1947 జూలై 22న భారత్య రాజ్యాంగ సభలో నెహ్రూ జాతీయ జెండా గురించి ఒక తీర్మానం చేస్తూ మునుపటి త్రివర్ణ పతాకంలోని రాట్నాన్ని తీసి, దాని స్థానంలో అశోకుని ధర్మచక్రాన్ని చిహ్నంగా ఏర్పాటు చేశారు. చిహ్నం మార్పు తప్పితే మన పింగళి వెంకయ్య రూపొందించిన జెండాకు నేటి జెండాకు తేడా ఏమీ లేదు.



పింగళి వెంకయ్య (ఫైల్)

కోటలో దక్కన్ ఆర్కియాలజీ అండ్ కల్చరల్ రీసెర్చ్ సెంటర్

ఏళ్ల తరబడి నిరుపయోగంగా, శిథిలావస్థకు చేరిన నడిగూడెం రాజావారి కోటను మునగాలకు చెందిన చరిత్ర నిపుణుడు జితేంద్రబాబు మరమ్మతులు చేయించి అభివృద్ధి పరిచారు. ఇదే కోటలో ప్రస్తుతం జితేంద్రబాబు ఆధ్వర్యంలో దక్కన్ ఆర్కియాలజీ అండ్ కల్చరల్ రీసెర్చ్ సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. ఈ పరిశోధనా కేంద్రంలో దాదాపు రెండున్నర లక్షలకు పైగా పుస్తకాలు, లక్ష తాళపత్ర గ్రంథాలు ఉంచారు.



నడిగూడెంలోని రాజావారి కోట

భారీ పతాకం ఆవిష్కరణకు ఏర్పాట్లు..

జెండా చారిత్రక నేపథ్యానికి గుర్తుగా నడిగూడెంలో 108 అడుగుల ఎత్తుగల స్తంభంపై 30 మీటర్ల పొడవు, 25 మీటర్ల వెడల్పు కలిగిన జాతీయజెండా ఆవిష్కరించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే ట్రయల్ రన్ కూడా పూర్తిచేశారు. అధికారికంగా ఆవిష్కరించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు సమాచారం.

కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్



మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

నల్లగొండ టౌన్: బీసీలకు స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్‌లను కల్పించే ఆర్డినెన్స్ రాష్ట్రపతి వద్ద ఉన్నందున వాటినిఆమోదించడానికి కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌తో పాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావులు కృషి చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక బీసీ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ నాయకులు కుల గణన సక్రమంగా జరగలేదని, బీసీల 42 శాతంలో ముస్లింలకు 10 శాతం ఎలా ఇస్తారని అంటూ తప్పించుకునే యత్నం చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైన రాష్ట్ర బీజేపీ నాయకులు ఢిల్లీలో ధర్నాలు చేసి కేంద్రంపై వత్తిడి తెచ్చి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించేందుకు ముందుకుపోవాలని డిమాండ్ చేశారు. రాహుల్‌గాంధీ బీసీల రిజర్వేషన్‌లపై పార్లమెంట్‌లో చర్చించాలన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లను కల్పించిన తరువాతనే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నేలపట్ల సత్యనారాయణ, కేశబోయిన శంకర్ ముదిరాజ్, నకిరేకంటి కాశయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

హాలియా: వ్యవసాయ పొలం వద్ద విద్యుత్ మోటారు ఆన్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై రైతు మృతి చెందాడు. ఈ ఘటన అనుముల మండలం కొత్తపల్లి గ్రామంలో గురువారం ఉదయం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరి(సాగర్) మండలంలోని శ్రీరాంపల్లి గ్రామానికి చెందిన కూరాకుల లక్ష్మయ్య(45) తన భార్యాపిల్లలతో కలిసి బతుకుదెరువు నిమిత్తం అనుముల మండలం కొత్తపల్లి గ్రామానికి వలస వచ్చాడు. గత 20 ఏళ్లుగా ఇక్కడే నివాసముంటూ తనకున్న ఎకరంన్నర భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం ఉదయం లక్ష్మయ్య తన పొలం వద్దకు వెళ్లి విద్యుత్ మోటర్ ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో హెడ్ కానిస్టేబుల్ యాదయ్య ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాగార్జుసాగర్‌లోని కమలానెహ్రూ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య సువర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ యాదయ్య తెలిపారు.

దొంగ ఓట్లతో బీజేపీకి మూడోసారి అధికారం

- పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్



పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు స్వాగతం పలుకుతున్న పటేల్ రమేష్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు

సూర్యాపేట : ఓట్ల దొంగిలింపుతోనే కేంద్రంలో మూడోసారి బీజేపీ అధికారంలోకి వచ్చిందన్న చర్చ దేశవ్యాప్తంగా ఉందని పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. గురువారం విజయవాడ నుంచి హైదరాబాద్ వెళుతూ సూర్యాపేటలో కాసేపు ఆగారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి రావడానికి ఓటర్లు, ఓట్లని మార్ఫింగ్ చేయడమే కారణమన్నారు. ఈ ప్రక్రియ తీవ్రమైన నేరం కిందకు వస్తుందని తెలిపారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌కు అనుకూలంగా ఉన్న వ్యక్తులకు నాలుగు రాష్ట్రాల్లో ఓటు హక్కు ఉండడం మామూలు విషయం కాదన్నారు. సింగిల్ బెడ్ రూమ్ ఇంట్లో 45 ఓట్లు నమోదవడంపై ఈసీ సమాధానం చెప్పాలన్నారు. ఓట్ల దొంగిలింపునకు నిరసనగా కార్యక్రమాలు చేపడుతామన్నారు. గవర్నర్ నియామకాల్లో ఇదివరకు జరిగిన రీతిగా ఎమ్మెల్సీలను నియమించామని, పొత్తులో భాగంగా కోదండరాంకు ఎమ్మెల్సీ టికెట్ ఇచ్చామని తెలిపారు. కేసీఆర్ కంటే కూడా ఎక్కువగా తెలంగాణ ఉద్యమంలో పాలుపంచుకున్న వ్యక్తి కోదండరాం అని అన్నారు. ఎమ్మెల్సీలపై కోర్టు తీర్పు చూసిన తర్వాత స్పందిస్తానని చెప్పారు. విలేకరుల సమావేశంలో ఆయన వెంట రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి ఉన్నారు.

గంజాయితో పట్టుబడిన పది మంది అరెస్ట్



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

నల్లగొండ: గంజాయితో పట్టుబడిన 10 మందిని నల్లగొండ వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసు వివరాలను గురువారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి విలేకరులకు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి నల్లగొండ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మునుగోడు రోడ్డులో కొందరు వ్యక్తులు గంజాయి సేవిస్తున్నట్లు పక్కా సమాచారం అందడంతో పోలీసులు దాడి చేసి మొగలిపాలెపు నూతన్‌కుమార్, మహ్మద్ అసద్, దిన్‌గన్ ఆకాష్, బి. లక్కి సుందర్, షేక్ జానీపాష, మహ్మద్ అజ్మల్‌ను అరెస్ట్ చేశారు. వారి నుంచి 1.65కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురికి రిహాబిలిటేషన్ సెంటర్‌కు తరలించి కౌన్సిలింగ్ ఇస్తున్నామని డీఎస్పీ తెలిపారు. అదేవిధంగా మిర్యాలగూడ రోడ్డులోని జూబ్లీహిల్స్ కాలనీ సమీపంలో మహ్మద్ ఇమ్రాన్, పొలిసెట్టి వెంకటేష్, నలపరాజు శివ, చిత్రం రాకేష్ గంజాయితో పోలీసులకు పట్టుబడ్డారు. వారి నుంచి 1.65 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారంతా నల్లగొండకు చెందిన వారే అని డీఎస్పీ పేర్కొన్నారు. వారిని పట్టుకున్న ఎస్ఐ సతీష్, పోలీస్ సిబ్బంది రబ్బాని, షకీల్, శ్రీకాంత్, శంకర్, సైదులు, జె. గోపాల్‌రావు, కె. సతీష్, ఏఎస్ఐలు వెంకటయ్య, వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, రమాదేవి, మహేశ్వరి, సైదులు, శ్రీనివాస్‌ను ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అభినందించారు.

• జలకళ.. ఎత్తిపోతల



నాగార్జునసాగర్: గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తెలంగాణ–ఆంధ్రప్రదేశ్ సరిహద్దులో కృష్ణానది తీరం వెంట చంద్రవంక వాగు ఉధృతంగా పారుతోంది. ఈ వరద సాగర్ సమీపంలోని ఎత్తిపోతల ప్రాంతంలో 70 అడుగుల మీద నుంచి లోయలోకి పడుతుండటం పర్యాటకులను ఆకట్టుకుంది.

ఆధ్యాత్మికత పెంపొందించడమే లక్ష్యం

- నేటినుంచి యాదగిరి ఆధ్యాత్మిక మాసపత్రిక ప్రారంభం
- త్వరలోనే చానల్‌ను ప్రారంభించే యోచనలో ఆలయ అధికారులు



యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయం

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జరిగే నిత్య పూజలు, ధార్మిక కార్యక్రమాల ప్రసారం ద్వారా ప్రజల్లో భక్తిభావం పెంపొందించడం కోసం దేవస్థానం ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక మాస పత్రిక తీసుకురానున్నారు. అంతే కాకుండా తిరుమల తిరుపతి దేవస్థానం (టి.టి.డి చానల్) తరహాలో భక్తి చానల్ ఏర్పాటు చేయాలని యాదగిరిగుట్ట ఆలయ అధికారులు యోచిస్తున్నారు. ఇటీవల ఆలయ ఉన్నతాధికారులతో జరిగిన సమీక్ష సమావేశంలో ఈఓ వెంకట్రావ్ వీటిపై చర్చించి, ఆగస్టు 15వ తేదీ స్వాతంత్ర్య దినోత్సవం నుంచి యాదగిరి ఆధ్యాత్మిక మాసపత్రికను ప్రారంభించనున్నారు.

ఆధ్యాత్మిక జ్ఞానం

యాదగిరి క్షేత్రంలో వేకువజామున మొదలుకుని రాత్రి ఆలయాన్ని ద్వారబంధనం చేసే వరకు వివిధ పూజలు, ధార్మిక కార్యక్రమాలు జరుగుతుంటాయి. తెలంగాణాలోనే కాకుండా వివిధ రాష్ట్రాలు, దేశ వ్యాప్తంగా శ్రీస్వామి వారికి కోట్లాది మంది భక్తులు ఉన్నప్పటికీ ఈ కార్యక్రమాలను చదవలేకపోవడంతో పాటు వీక్షించలేకపోతున్నారు. చానల్‌లో, మాస పత్రికల్లో ఈ కార్యక్రమాలను ప్రసారం చేయడం ద్వారా భక్తులను దేవుడికి మరింత దగ్గర చేస్తాయని అధికారులు భావిస్తున్నారు. భక్తులు తమ ఇళ్లలో ఉండి కూడా దైవారాధనలు చేయడానికి దోహదపడుతుంది. వీటితో పాటు వివిధ దేవుళ్ళ గురించి, వారి మహిమల గురించి, భక్తి మార్గాలు, నైతిక విలువలు, సామాజిక బాధ్యతల గురించి ప్రజలకు తెలియజేయవచ్చన్నది యాదగిరి దేవస్థానం ఉద్దేశం.

ఇతర ఆలయాల సమాచారం

నూతనంగా తీసుకువచ్చే మాస పత్రికతో పాటు భక్తి చానల్‌లో వివిధ కార్యక్రమాలు ఉండనున్నట్లు తెలుస్తుంది. ప్రధానంగా జ్యోతిష్యం, పంచాంగం, ధార్మిక ఉపన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, రాష్ట్రంలో వివిధ ఆలయాల సమాచారం, వాటి ప్రాశస్త్యం, ఆధ్యాత్మిక చర్చలు, తీర్థయాత్రల గురించి ఉంటాయని తెలుస్తుంది. ప్రస్తుతం యాదగిరి క్షేత్రంలో వివిధ పూజాది కార్యక్రమాలను వీడియో తీసి, ఆలయ తూర్పు మాఢ వీధిలోని బ్రహ్మోత్సవ మండపం చెంత ఏర్పాటు చేసిన ఎల్.ఈ.డీ స్క్రీన్‌లో ప్లే చేస్తున్నారు. ఇందులో లైవ్ రాకపోవడంతో ఆలయంలో ఏమీ కార్యక్రమాలు జరుగుతున్నాయో బయట ఉండే భక్తులకు తెలియడం లేదు. దీంతో చానల్ ఏర్పాటు చేయడం ద్వారా ఆలయంలో వేకువజాముమ నుంచి రాత్రి ఆలయాన్ని ద్వారబంధనం చేసే వరకు జరిగే సుప్రభాతం, బిందె తీర్థం, నిజాభిషేకం, సహస్రనామార్చన, శ్రీసుదర్శన నారసింహహోమం, నిత్య కల్యాణం, జోడు సేవలు, ఊంజలి సేవ, శయనోత్సవం వంటివి భక్తులకు లైవ్‌గా అందించవచ్చునని అధికారులు భావిస్తున్నారు. అంతే కాకుండా శ్రీస్వామి వారి ఆలయంలో జరిగే విశేష పూజలు, బ్రహ్మోత్సవాలు, పవిత్రోత్సవాలు, జయంతి ఉత్సవాలు, ఇతర ముఖ్య వేడుకలను సైతం లైవ్ చానల్ ద్వారా ప్రసారం చేయడంతో భక్తుల నుంచి ఆలయానికి మరింత ఆదరణ లభించనుందని అధికారులు చర్చలు చేపడుతున్నారు.

మాతృ భాషలోనే పత్రిక, చానల్

మాతృభాష తెలుగులోనే ఈ మాస పత్రికను రూపొందించనున్నారు. తెలుగు మాట్లాడే ప్రజలు తమ మాతృభాషలో భక్తిని పెంపొందించుకోవడానికి, దేవుడితో అనుబంధం పెంచుకోవడానికి సులభంగా ఉంటుందనే ఆలోచనలో ఆలయాధికారులున్నారు. ఆలయంలో జరిగే విశేష పూజలను వివరిస్తూ ప్రజల్లోకి తీసుకెళ్లేదుకు మాస పత్రిక ఎంతో దోహదపడనుంది.